


"ఛీ! దుర్మార్గుడా! వొదులూ చేయి. అనవసరంగా అసహాయురాలైన ఆడదాని జోలి కొస్తున్నావ్! నీపాపం నిన్నే నాశనం జేస్తుంది. వొళ్ళు దగ్గర పెటుకుని బ్రతుకు."

ఎక్కడనుంచి వసోంది ఈ శబ్దం? రహదారిలో, ఇంకా సాంతం ప్రొద్దుక్రుంకనే లేదు, ఇంతసాహసానికి పూనుకునే అవివేకి ఎవరు? నేను చాలాసేపు తొక్కించుకుని ఇటు అటు పారజూచాను. ఏమాత్రం బోధపడ్లేదు.

కాలేజీ వదిలిపెట్టగానే ఒక గంటసేపు బజార్లో దుమ్మంతా పైజమాకు కొట్టుకుని కొంప చేరుకుంటూంటాను ప్రతిరోజూ. బ్రాడీపేట గండన్ లైన్‌లో చిట్టచివర క్రాస్ రోడ్డులో వుంది మా బ్రహ్మచారివసతి గృహం! నాకు దాదాపు పొరుగువూరు పోయివస్తున్నట్టుగానే వుంటూంది. ముఖ్యంగా ఈ రోడ్డులో బస్తీ కుండాల్సిన లక్షణం, జనసమ్మర్దం, ట్రాఫిక్ క్రిక్కిరిసి వుండవు. కాబట్టి ఈ అభిప్రాయం సహజంగానే మనస్సులో నాటుకుపోయింది.

ఎర్రని సూర్యకిరణాలు ఇండ్లచాటునుంచి తొంగిచూస్తూ నిర్మలంగా వున్న తారురోడ్డుకు క్రొత్త అందాన్నిస్తున్నాయి. ఇండ్లలోనుండి వస్తూన్న పొగ, తగ్గిపోతూన్న వెలుతురూ, సినిమాకు వేళ అయిందని చాటుతున్నాయి. రోడ్డుకు యిరువైపులా అక్కడక్కడ వున్న [illegible]చెట్లమీదుగా చల్లని గాలి కూనిరాగాలు లాపించమని బ్రతిమిలాడుతున్నది. అయినా నే నీరోడ్డు మీద సంగీతకచ్చేరీ పెట్టుకున్నామంటే ఆఖరిసారి సురయాను చూచే అదృష్టం చేతులారా జారవిడుచుకున్నట్టే! జోరుగా తొక్కుతున్నాను సైకిలు. మూసివున్న యింటి వాకిళ్ళు, తలుపు తెరిచి వుంచబడిన పాకీదొడ్లు వెనక్కు పరుగెత్తుకుపోతూన్నాయి. మొండిబండ హెర్క్యులెస్ కాబట్టి సరిపోయింది గాని మరొకటయితే ముక్కలైపోయేది ఆ వేగానికి.

"ఆరి పిడుగా! నీవేనా? నాచేతిక్రింద నీళ్ళు తాగి నాకే ద్రోహం తలపెట్టావ్."

## శ్రీ పోగుల కోటీశ్వరరావు.

ఇంతకీ ఈ గొంతు ఎటునుంచి వినిపిస్తున్నది? నాకు సమీపంలో ఎవరూ మనుష్యులున్నట్టు తోచదు. రోడ్డు పక్క ఇండ్లలోనుంచేమో! నాకెదురొచ్చిన గొడవ ఇది? ఏదైనా అఘాయిత్యం జరిగితే, విచారణ, సమన్లు, సాక్ష్యాలు, తప్పుడు సాక్ష్యాలు... నారపన్నడి. ఇంతకీ తెగదు. మెదగా వుండటమే మంచిది. కష్టబోయేంత కాటి కెందుకు? నటిస్తూ ముందుకు చూచా... రోడ్డుమలుపులో ఒక వంద గజాలదూరంలో ఓ పిల్లని ముద్దు బిబిరా కారెక్కిపోతోంది—1950-వ సంవత్సరం హడ్సన్ కారు.

"అమ్మో! అయ్యో!"

ఎవరో స్త్రీ అపాయంలో వున్నది. సహాయంకోసం ఆరాటపడుతున్నట్టున్నదా స్వరం. సందేహం లేదు. ఆ కారులోనే జరుగుతూన్నది—ఒక డిటెక్టివ్ కథకుడికి వేరుగా అల్లుకోవాల్సిన పని లేకుండా కావలసిన రసవత్తరఘట్టం. ఇంక సైకిల్ చక్రంతోపాటు నాబుర్రకూడా అంతులేకుండా తిరగటం ప్రారంభించింది. కర్తవ్యం ఏమిటి? తటస్థ విధానం అవలంభించితే! బాగానే వుంది. 'అహం' వరకు ఈ సిద్ధాంతం చక్కగానే పనిచేస్తుంది ఆక్షేపణ లేకుండా. అయితే, 'ఇహం'లో, అందులోనూ నాసమక్షంలో జరుగుతూన్న ఈ అపచారాన్ని సహించి సర్దుకుపోవడమేనా?

"అమ్మో! రోడ్డుమీద ఒక్కరూ లేరే! వీడిబారినుండి తప్పించే దిక్కు లేకుండా పోయిందే! ఓహ్!"

ఉపేక్షించి చూస్తూ కూచుంటే ప్రయోజనం లేదు. నాబుర్రలో తిరుగుతున్న నిగ్రహం లేని భావాలు ఒకరూపం పొందాలి. దోవా తెన్నూ లేకుండా ఎంత సేపు మగ్గాలో? కండెలాగు, ఆలోచన తెగకుండా వుంటుందా? ఒక్క పరుగులో కారులో పడి మన ప్రతాపాన్ని బుజావు చేసుకోవాలి.

నా మనస్సులోని ఆలోచనాశక్తి పిక్కల్లోకి వచ్చి ఒక్కుమ్మడిగా రెండుగూడు నిమిషాల్లో కారును కలుసుకునేట్టు చేసింది. అడ్డంగా సైకిలు పెనిస్తే వాడే కారుకు బ్రేక్ వేసుకుంటాడు. మనపని తేలికపడుతుందనుకున్నాను. కారులో ఏం జరుగుతోందో చూడకుండా రోడ్డుకు అడ్డంగా పెట్టాను.

అనుకున్న దంతా అర్ధనిమిషం లోటులేకుండా జరిగింది. అయితే అనుకోనివి చాలా వెంటనే వొచ్చాయి. నేను అడ్డం రావటం, కారు తప్పుకోవాలని ప్రయత్నం చెయ్యటం, రోడ్డు వదలి మార్జిన్‌లోకి రావటం, గత్యంతరం లేక ప్రక్క గొందికి తిప్పుకోబోయి ఎదుటి యింటి గోడకు మోటే ఇవ్వటం—వరుసగా మెరుపుల్లాగు సంభవించినయి.

తలుపు నెట్టుకుని కారులోంచి ఒక వ్యక్తి తలకాయ బయటపెడుతూనే నావంక చూచి నిప్పులు కక్కాడు. వాడే 'హంతకు'డని భావించాను. ఇంక సైకిల్ మీద ముడి నిలువలేదు నాకు. పైగా నామీద దాష్టీకంగా అరవటం మొదలుపెట్టాడు: "బతకాలని లేదురా? చస్తావుట్రా! కారు మీదగా పోనిస్తే ఈపాటికి గానుగలో చెరుకుముక్క అయ్యేవాడివి. సైకిలు తొక్కటం చాతగాక పోతే అవతల పారేసి నెత్తిమీద గుద్దేసుకు పోరాదూ!"

నాకు అరికాలిమంట నెత్తి కెక్కింది. నన్ను చూడగానే గజగజా వొణికి గోచీ వూడిపోయి పారిపోవాల్సిన వెధవ నన్నే తూలనాడుతున్నాడుగా!

సైకిల్ అవతల పారేశాను. వాడు అరిచి నందుకు గాదు. వాడిమీద యుద్ధానికి ప్రయత్నంలో ఇది మొదటి మెట్టు. చొక్కా కప్పులు విప్పి మోచేతివరకు మడిచాను, ఒక్కసారి కాలరు పట్టుకొని పిడికిలి బిగించి ఒకే ఒక గుద్దు ఇచ్చుకున్నాను వాడి మొహంమీద. ఈ దెబ్బకు జోలాయీస్ కాదుగదా; వాడి అబ్బలాంటివాడు గూడా గిలగిలా కొట్టుకోవాల్సిందే! చప్పాడను కునే క్రిందకు చూస్తే వాడు నేలమీద బోర్ల పడి మూలుగుతున్నాడు. నా ధీరత్వాన్ని అభినందించేవా ళ్ళెవరూ అక్కడ లేనందుకు నాకు చాలా చిన్నతనం వేసింది. కనీసం నేను రక్షించిన స్త్రీయైనా నాకు భట్రాజు పొగడ్తల నిస్తుందనే ఆశతో కొంతవరకు తృప్తిపడక పోలేదు.

వాడివల్ల ప్రమాదం లేదని నిశ్చయించుకున్నాను. దౌర్జన్యానికి గురిఅయిన వ్యక్తి కోసం వెతికాను. కారులో స్త్రీ కాదుగదా. ఒక్క పురుగుకూడా లేదు. ఏమిటిది? ఇంతలోనె మాయమైపోయిందా! అధమం నాకు కృతజ్ఞత తెలియచెయ్యకుండానే వెళ్లిపోతుందా! భయంతో పారిపోయి వుంటుంది. చుట్టుప్రక్కలకు చూపులు పంపాను. శూన్యంగా తిరిగివచ్చినయి. చిత్రంగా మాయమై పోయిందా స్త్రీ.

ఇంతవరకూ జరిగిన సంఘటనలోనే నా మనస్సు నిండా మునిగిపోయింది. బయట ఏం జరుగుతోందో, ఏం వున్నదో, తెలుసుకునే పాటి మెలకువ లేకుండా పోయింది నా శరీరానికి. కళ్లుమాత్రం ఆకాంతకోసం విరామం లేకుండా పనిచేస్తున్నాయి. ఇలా అయిదునిమిషాలు గడచిం తర్వాత తిరిగి మామూలు ప్రపంచంలో పడ్డాను.

శీఘ్రం ఇంటికిపోవ టం మంచిది. పోలీసులు వచ్చి రచ్చ కెక్కించకముందే జాగ్రత్త పడదా మనుకున్నాను. సైకిలు చేత పుచ్చుకుని ఎక్కబోతూ మళ్లీ ఒక్కసారి కారువంక కన్ను పోనిచ్చాను. కారు నెత్తిమీద, పొడవుగా రెండు ఇనుపవూచలు దూరదూరంగా వుండి సన్నని తీగలతో కలుపబడి వున్నాయి. తేరిపార చూస్తుండగా కారు లోంచి శబ్దం వినవచ్చింది:

"ఆలిండియా రేడియో-విజయవాడ. మీరు ఇంతవరకు "రహదారిహత్య" అనే డిటెక్టివ్ నాటిక విన్నారు. రచయిత 'అపరాధశ్రీ'. ఇందు పాల్గొన్నవారు: సుబ్బారావు, కమల, వెంకటరత్నం. తరువాత కార్యక్రమం, మానిలయవిద్వాంసుల వాద్యసంగీతం మరి కొద్దిక్షణాల్లో ప్రారంభమౌతోంది."

(ఆంగ్లకథ ఆధారం)


ఇటియాల్ ఆదర్శమైనది

పూతి నాశిని
క్రిమి నిర్మూలిని
హాయి నిచ్చును
విషసంబంధం కాదు!




I.T.L

తయారించువారు:
ది మైసూరు ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు.

ప్రతినిధులు: బెస్ట్ & కంపెనీ, లిమిటెడ్,
పోస్టుబాక్సు నెం. 63, మదరాసు.